ఓం నమఃశివాయ

ఘనంగా మహా శివరాత్రి వేడుకలు



శంభో శివశంభో... హరహర మహాదేవ శంభోశంకర అంటూ భక్తుల శివనామ స్మరణలతో శివాలయాలు మార్మోగాయి. బుధవారం పట్టణం, గ్రామీణ ప్రాంతాల్లోని శివాలయాల్లో భక్తులు తెల్లవారుజాము నుంచే స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు దగ్గరలోని నదుల్లో పుణ్యస్నానాలు చేసి స్వామికి పూజలు చేశారు. అదేవిధంగా పూర్వీకులకు పిండ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా శివాలయాల్లో అర్చకులు అభిషేక పూజలు, గోత్ర నామ పూజలు నిర్వహించడంతో పాటు శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ, ఇతర సేవా కమిటీల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. పలు చోట్ల వైద్యశిబిరాలు నిర్వహించగా.. పోలీసులు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చేపట్టారు.

– సాక్షి నెట్‌వర్క్

- శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- దర్శనానికి పోటెత్తిన భక్తులు
- తెల్లవారుజాము నుంచే పుణ్యస్నానాల ఆచరణ
- పూజల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు



పెనుబల్లి: నీలాద్రీశ్వరుడికి పూజలు నిర్వహిస్తున్న ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి



కొణిజర్ల: పల్లిపాడులో ప్రభలతో వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్



పెనుబల్లి: నీలాద్రీశ్వరుడి ఆలయంలో ఎమ్మెల్యే రాగమయి, దయానంద్ దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకుడు



మధిర: అన్నదానం చేస్తున్న కలయిక వాకర్స్



సత్తుపల్లిరూరల్: గంగారం బెటాలియన్ శివాలయంలో అన్నదానం చేస్తున్న కమాండెంట్ పీజేపీసీ చటర్జీ



తల్లాడ: నూతనకల్ శివాలయంలో అన్నదానం



కారేపల్లి: శ్రీకోటిలింగాల జాతరలో.. శివలింగానికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు



కల్లూరురూరల్: శివాలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య



వైరారూరల్: పూర్వీకులకు పిండప్రదానం చేస్తున్న దృశ్యం



సత్తుపల్లిటౌన్: వెంగళరావునగర్ శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు



చింతకాని: నేరడ శివాలయంలో ధ్వజస్తంభం వద్ద మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



ఎర్రుపాలెం: బనిగండ్లపాడులో శ్రీదుర్గామల్లేశ్వరస్వామివారి ఆలయంలో..



బోనకల్‌లో..



వైరారూరల్: స్నానాల లక్ష్మీపురంలో..



ముదిగొండ: వల్లాపురం మున్నేరు ప్రాంతాన జాతరలో..

నీలాద్రీశ్వరాలయంలో ప్రత్యేక పూజలు

పెనుబల్లి: మండలంలోని భవన్నపాలెం అటవీప్రాంతంలోని నీలాద్రీశ్వరాలయం గతంలో ఎన్నడూ లేని విధంగా రెండు లక్షలకు పైగా భక్తులతో జనారణ్యంలా మారి శివనామస్మరణతో అరణ్య వాతావరణం పులకరించింది. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, రాజ్యసభ్యులు వద్దిరాజు రవిచంద్ర, సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి, దయానంద్ దంపతులు, ఐడీసీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్యలతో పాటు పలువురు ప్రముఖులు, లక్షలాది మంది భక్తులు స్వామిని దర్శించుకుని భక్తి పారవశ్యంలో మునిగి తేలారు. ఆలయ ఆవరణలో కోటి రుద్రాక్షలతో ఏర్పాటు చేసిన మహా శివలింగం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేసి ముత్యుంజయ యాగంలో పాల్గొన్నారు.



పెనుబల్లి: నీలాద్రీశ్వరుడికి అభిషేకం చేస్తున్న రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

రాత్రి సమయంలో కన్నుల పండువగా నీలాద్రీశ్వరుడి కల్యాణం నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే రాగమయి దయానంద్ దంపతులు ప్రారంభించారు.

స్నాన ఘట్టం ప్రారంభం

చింతకాని: మండలంలోని నేరడ గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నిర్మించిన స్నాన ఘట్టాన్ని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. స్నాన ఘట్టం నిర్మాణానికి మంత్రి శ్రీనివాసరెడ్డి రూ.3 లక్షలను విరాళంగా అందజేశారు. అనంతరం ఆలయంలో దయాకర్ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మనోహర్‌బాబు, నాగేశ్వరరావు, శ్రీను, సీతారామయ్య, నర్సింహారావు, పానకాలరావు, చిన్ని, బీఆర్ఎస్ నాయకులు రమేష్, టీడీపీ మండల అధ్యక్షుడు తాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



నేరడ శివాలయం వద్ద నిర్మించిన స్నాన ఘట్టాన్ని ప్రారంభిస్తున్న తుంబూరు దయాకర్ రెడ్డి

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



కల్యాణానికి హాజరైన భక్తులు

కొణిజర్ల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండల కేంద్రం కొణిజర్లతోపాటు, పెద్ద మునగాల గ్రామంలో విశ్వ బ్రాహ్మణులు బుధవారం పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి గోవిందమాంబల కల్యాణ క్రతువు వైభవంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణులతో పాటు ఇతరులు కూడా పెద్ద ఎత్తున దేవాలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.



కొణిజర్లలో వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణంలో పాల్గొన్న భక్తులు

నీలాద్రికి పది నిమిషాలకో బస్సు

సత్తుపల్లిటౌన్: మహాశివరాత్రి సందర్భంగా సత్తుపల్లి బస్టాండ్ నుంచి నీలాద్రి శైవక్షేత్రానికి బుధవారం డిపో మేనేజర్ కె.రాజ్యలక్ష్మి ఆధ్వర్యాన ప్రతి పది నిమిషాలకో బస్సు చొప్పున 25 ఆర్టీసీ బస్సులు తిప్పారు. బస్టాండ్, నీలాద్రిలో ప్రత్యేక బస్ షెల్టర్లు ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ సీఐ విజయశ్రీ, ఎంఎఫ్ సాహితి, సూపర్‌వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

భావి తరాలకు ఆదర్శం అయిలయ్య



అయిలయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

వైరా: ప్రజల్లో మమేకమై, ప్రజా సమస్యలకై తన జీవితాన్ని అర్పించిన కాసాని అయిలయ్య జీవితం భావి తరాలకు ఆదర్శమని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. బుధవారం వైరాలో కాసాని అయిలయ్య సంస్మరణ సభలో ఆయన పాల్గొని అయిలయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకుడు మల్లెంపాటి వీరభద్రం, సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబులు పూలమాలలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు, బొంతు సమత, చింతనిప్పు చలపతిరావు, పారుపల్లి కృష్ణారావు, బాణాల శ్రీనివాసరావ తదితరులు పాల్గొన్నారు.

మాదిగ అమరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న సునీల్

బోనకల్: వచ్చేనెల 1న మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్ మాదిగ కోరారు. బుధవారం మండలంలోని మోటమర్రి గ్రామంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎటువంటి లోపాలు లేని ఎస్సీ వర్గీకరణ సాధించి అమరులకు అంకితమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి చిలకా నాగరాజు మాదిగ, జిల్లా ప్రధాన కార్యదర్శి కోటా హనుమంతరావు, తాటికొండ వెంకటరత్నం, తోటపల్లి సైదులు, మావి ముఖేష్, రాజేష్, కిశోర్, ప్రకాశం, తోటపల్లి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మడుపల్లి హైస్కూల్ వార్షికోత్సవం



మాట్లాడుతున్న సీఐ మధు

మధిర: మడుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాత్రి పాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. చెరుకూరి వెంకటేశ్వరరావు సహకారంతో నిర్మించిన చెరుకూరి నరసయ్య, సుబ్బమ్మ స్మారక కళావేదికను మధిర సీఐ మధు, ఎంఈఓ ప్రభాకర్ ప్రారంభించి మాట్లాడారు. సమాజ శ్రేయస్సు కోసం తమ వంతు కర్తవ్యంగా ఆర్థికంగా సహకరించినప్పుడే మరింత సంపన్నులు అవుతారని తెలిపారు. అదే కోవకు చెందిన నరసింహారావు హైస్కూల్‌కు, గ్రామానికి చేస్తున్న సేవలను కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఉపాధ్యాయులు విద్యనందిస్తున్నారని, విద్యార్థులు చక్కగా చదివి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. వివిధ క్రీడల్లో విజేతగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో భరత్ విద్యా సంస్థల అధినేత శీలం వెంకటరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం నరసింహారావు, మాటూరు హైస్కూల్ హెచ్‌ఎం శ్రీహరి, హరిజనవాడ హైస్కూల్ హెచ్‌ఎం విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సరోత్తమ్ రెడ్డిని గెలిపించాలి

బోనకల్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థి సరోత్తమ్ రెడ్డిని గెలిపించాలని బీజేపీ మండల అధ్యక్షురాలు మౌనిక అన్నారు. బుధవారం బోనకల్‌లో ఉపాధ్యాయులను కలిసి ఓట్లు అభ్యర్థించారు. తెలంగాణలో గత ప్రభుత్వాలు 310 జీవో ఉపాధ్యాయులను ఆందోళనకు గురిచేసిందన్నారు. సరోత్తమ్ రెడ్డి గెలవడం ద్వారా శాసనమండలిలో ఉపాధ్యాయుల సమస్యలపై గట్టిగా మాట్లాడి పరిష్కరిస్తారని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యలపై పోరాడే సరోత్తమ్ రెడ్డికి మొదటి ప్రాధాన్యతగా ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు తాళ్ళూరి సురేష్, జంపాల రవి, కాలసాని పరుశురాం, దొంతు రామకృష్ణ, మరీదు రామారావు తదితరులు పాల్గొన్నారు.

వితరణల వెల్లువ..

ఆలయ అభివృద్ధికి వితరణ



కల్లూరు: శివాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రాగమయి, తదితరులు

కల్లూరు: మహా శివరాత్రి సందర్భంగా కల్లూరు పట్టణంలోని శ్రీ కాశ్మీర మహాదేవ క్షేత్రంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే మట్టా రాగమయి, దయానంద్ దంపతులు పాల్గొన్నారు. మహా అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కూడా పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ కాశ్మీర మహాదేవ క్షేత్రం అభివృద్ధికి రూ.20,116లు ఎర్రబోయినపల్లి గ్రామానికి చెందిన పోట్రు ప్రవీణ్, కిరణ్ సోదరులు అందించారు.

కలకొడిమేశ్వర ఆలయానికి.. రూ.50 వేల విలువైన నాగబంధం..



నాగబంధాన్ని అందజేస్తున్న దాతలు

తల్లాడ: మండలంలోని కలకొడిమలో వేంచేసి ఉన్న కోదండ సహిత కలకొడిమేశ్వర ఆలయానికి గ్రామానికి చెందిన శ్రీలక్ష్మి, నాగబాబు దంపతులు రూ.50 వేలు విలువైన నాగబంధంను వితరణగా అందజేశారు. ఆలయ చైర్మన్ దిరిశాల దాసురావుకు బుధవారం నాగబంధాన్ని అందించగా.. దాతలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తల్లాడ మాజీ జెడ్పీటీసీ దిరిశాల ప్రమీల, గంధం నారాయణ, సీతామహాలక్ష్మి, వడ్డే వెంకటేశ్వరరావు, గోళ్ల ఐతంరాజు, కొత్తపల్లి పిచ్చయ్య, వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్

పడకేసిన పారిశుద్ధ్యం



వైరా మండలంలోని వల్లాపురం గ్రామంలో గల ఎస్సీ కాలనీలో పారిశుద్ధ్యం పడకేసింది. ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న పలువురు తమ ఇంటి ముందు ఉన్న డ్రెయిన్ల మీద మట్టి పోయించారు. దీంతో ఇళ్లల్లో వాడుకునే అపరిశుభ్రత నీరంతా డ్రెయిన్ మూసుకుపోవడంతో దాని మీదుగా రోడ్డుపైకి చేరుతుంది. మురుగునీరు ఎటుపారే అవకాశం లేకపోవడంతో ఇంటి ఎదుటే నిల్వ నిలిచి దోమలకు ఆవాసాలుగా మారాయి. అధికారులు ఇకనైనా స్పందించి డ్రెయినేజీలు ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

– వైరారూరల్

ప్రశ్నించాల్సిన అధికారి :
లక్ష్మణ్, పంచాయతీ కార్యదర్శి
సెల్ నంబర్ : 9849515939

ఎమ్మెల్సీ ఎన్నికలకు సర్వం సిద్ధం



వైరాలో పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బందితో తహసీల్దార్ కేవీ శ్రీనివాస్



కల్లూరులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రాజేందర్



ఎర్రుపాలెం: సిబ్బందికి సూచనలు చేస్తున్న తహసీల్దార్ ఉషాశారద

వైరా/కొణిజర్ల: ఖమ్మం, నల్లగొండ, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు గాను వైరా, కొణిజర్ల మండల కేంద్రంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మేరకు వైరాలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించిరు. ఏర్పాట్లను పర్యవేక్షించారు. మొత్తం 112 మంది ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పోలింగ్ నిమిత్తం నలుగురు పోలింగ్ సిబ్బంది, ముగ్గురు పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. అదే విధంగా కొణిజర్ల మండలంలో 66 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాము తెలిపారు. ఈ మేరకు కొణిజర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నలుగురు పోలింగ్ సిబ్బంది, ఇద్దరు పోలీస్ సిబ్బందితో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. గురువారం ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

● కల్లూరు/సత్తుపల్లిటౌన్/తల్లాడ: కల్లూరులో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో 94 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని తహసీల్దార్ పులి సాంబశివుడు తెలిపారు. గురువారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాన్ని బుధవారం ఆర్‌డీఓ ఎల్ రాజేందర్ సందర్శించారు. పోలింగ్ కేంద్రంలో పీఓ, ఇద్దరు ఓపీలు, ముగ్గురు పోలీసులు ఉంటారని తహసీల్దార్ తెలిపారు. అదే విధంగా సత్తుపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో 117వ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా.. 277మంది ఓటర్లు ఉండగా.. ఒక పోలింగ్ అధికారి, ఒక సహాయ పోలింగ్ అధికారి, ఇద్దరు పోలింగ్ సిబ్బంది, పోలింగ్ సామగ్రితో బుధవారం సాయంత్రం చేరుకున్నారు. పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేశారు. తల్లాడ జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ పి.సురేష్‌కుమార్ తెలిపారు. మొత్తం 37 ఓట్లున్నాయని ఇందు కోసం అన్ని ఏర్పాట్లు పూర్తైనట్లు ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు.

● ఎర్రుపాలెం/ముదిగొండ: ఎర్రుపాలెం మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో, ముదిగొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్న టీచర్ ఎమ్మెల్సీ పోలింగ్ స్టేషన్‌ను బుధవారం తహసీల్దార్లు ఎం.ఉషాశారద, సునీత ఎల్జిబెత్, ఎస్సై వెంకటేష్‌లు పరిశీలన చేశారు. పోలింగ్ సామగ్రితో పాటు సిబ్బంది స్టేషన్‌కు చేరుకున్నారు. ఎర్రుపాలెం మండలంలో మొత్తం 59మంది ఓటర్లు, ముదిగొండలో 35మంది ఓటర్లు ఉండగా.. ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు తహసీల్దార్లు తెలిపారు.